క్లుప్తంగా

ఎకనామిక్స్ విభాగంలో వెంకట సుబ్బయ్యకు డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సుంకరి వెంకట సుబ్బయ్య

పెద్దదోర్నాల: జిల్లాలో పప్పు ధాన్యాల సాగు ఆర్థిక విశ్లేషణపై పరిశోధనలు చేసినందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు మండలానికి చెందిన సుంకరి వెంకట సుబ్బయ్య డాక్టరేట్ ప్రదానం చేశారు. గతంలో జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఫెలోషిప్ కూడా ఆయన పొందారు. డాక్టరేట్‌ను ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మధుబాబు, డీన్ ప్రొఫెసర్ త్రిమూర్తిరావుల చేతుల మీదుగా వెంకట సుబ్బయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్, సుంకరి వెంకట సుబ్బయ్యను, గంటవానిపల్లి ప్రజలు అభినందించారు.

పాఠశాలకు భోజనం ప్లేట్లు అందజేత

తాళ్లూరు: మండలంలోని స్థానిక తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం విద్యా కమిటీ చైర్మన్ షేక్. శంషాద్ బేగం పాఠశాల విద్యార్థులకు 100 భోజనం ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైఎస్సార్ కె.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

ముండ్లమూరు(కురిచేడు): ముండ్లమూరు మండలంలోని శంకరాపురం సచివాలయం నిర్మాణానికి సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేడికొండ శేషగిరిరావు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. సచివాలయం భవన నిర్మాణానికి సంబంధించి కొంత బిల్లు మాత్రమే చెల్లించారని, మిగిలిన బిల్లు చెల్లించలేదన్నారు. ఆ భవనానికి సంబంధించి ప్రభుత్వం నుంచి 2024 అక్టోబర్‌లో రూ.8,17,662 గ్రామ పంచాయతీ ఖాతాకు జమ అయినట్లు తెలిపారు. దానికి సంబంధించి ఆ నెల 30వ తేదీ అప్పటి ఎంపీడీఓ ఎఫ్‌టీఓ ఇచ్చారని, దాన్ని గ్రామ పంచాయతీలో అందజేసినా ఇప్పటి వరకు ఆ బిల్లులు ఇవ్వలేదన్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారికి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. బిల్లులు ఇప్పించి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరాడు.


బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్

తాళ్లూరు: బాల్య వివాహాలను అరికట్టి బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పీడీ బీవీ సాగర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై ఎస్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు బాలల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బీమా పథకాలు ఉపయోగించుకోవాలి



బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్

తాళ్లూరు: ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే బీమా పథకాలను ఉపయోగించుకోని లబ్ధి పొందాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బొద్దికూరపాడు శాఖ మేనేజర్ బాపట్ల నారాయణ కోరారు. ఇటీవల కాలంలో బొద్దికూరపాడు బీసీ కాలనీ చెందిన దాండ్లపాటి గురవమ్మ మరణించగా మంగళవారం ఆయన భర్త దాండ్లపాటి వెంకటేశ్వర్లుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.2 లక్షల చెక్కును వారికి అదించినట్లు మేనేజర్ తెలిపారు. బాపట్ల నారాయణ, సిబ్బంది, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ .అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై హెల్పర్‌కు గాయాలు

కంభం: విద్యుత్‌లైన్ వద్ద మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై హెల్పర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే హెల్పర్ నాగరాజును లైన్‌మెన్ మరమ్మతుల నిమిత్తం తీసుకెళ్లగా పనిచేస్తున్న సమయంలో ప్రమాదానికి గురై తలకు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ప్రభపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మోసానికి, వంచనకు మారు పేరు సీఎం చంద్రబాబు అని, మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రజాదరణ, ఉనికిని చూసి టీడీపీ నాయకులు భయపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముందుకు తీసుకొచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో విద్యార్థులు చదువుకునేందుకు కేంద్రీయ విద్యాలయం అభివృద్ధి, మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రారంభించి పనులు చేపట్టింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి పాలన మొత్తం మోసాలతోనే సాగుతోందని, సంక్షేమనేది మటుమాయమైందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా పక్కాగా అమలు చేయని అసమర్థ స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తానని టీడీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు పథకం ద్వారా లక్షలు ఖర్చు చేశారని, ఇప్పటి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా పాఠశాలల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నిలిచి పోయాయన్నారు. సవాలక్ష కొర్రీలతో తల్లికి వందనం పథకాన్ని పేదలకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు విడుదల చేసి, అందులో రూ.2 వేలు పాఠశాల నిర్వహణకు ఉపయోగించుకోవాలని చెప్పినప్పుడు చాలా రాద్ధాంతం చేసిన నారా లోకేష్ ఇప్పుడు తల్లికి వందనం పథకం డబ్బులు రూ.2 వేలు తగ్గించి ఇవ్వడం, వాటిని పాఠశాలలకు కాకుండా ఎక్కడికి మళ్లిస్తున్నారో చెప్పాలన్నారు. మద్యం పాలసీని మార్చి గ్రామాల్లో వీధి వీధినా బెల్ట్ షాపులను, అక్రమంగా ఇసుకను యథేచ్ఛగా టీడీపీ నాయకులు అమ్ముకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రస్తుత ప్రభుత్వంలో కేవలం టీడీపీ కార్యకర్తలకే సంక్షేమం, వారి అభివృద్ధే లక్ష్యం అన్న రీతిలో పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచులు పాలగిరి రామాంజనేయరెడ్డి, మూల రమణారెడ్డి, బెజవాడ ఆదాము, మండల సీనియర్ నాయకులు ఏర్వ చిన్నకోటిరెడ్డి, నాయకులు కుందురు సత్యనారాయణరెడ్డి, ఏర్వ శేషసేనారెడ్డి, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోటు గంగయ్య, తోకల ఆవులయ్య, వెన్నా శివకృష్ణారెడ్డి, ఏలూరి వెంకటనారాయణరెడ్డి, వజ్రాల ఆదినారాయణరెడ్డి, గొట్టం వేణుగోపాలరెడ్డి, కాసు వెంకటరెడ్డి, దుద్దెల వెంకటరెడ్డి, ఐదు మండలాల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తుమ్మలబైలు గిరిజన గూడెంలో 'ధర్తి అబ జన్‌బగీదారి అభియాన్' కార్యక్రమంపై చెంచు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల గురించి గిరిజనులకు వివరించారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు, మంచి నీళ్లు, విద్యుత్, రహదారులు, రేషన్ కార్డులపై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డులు లేని వారు ఆధార్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ కమల కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, చైతన్యకుమార్, లాలా అహమ్మద్, శివశంకర్, పంచాయితీ కార్యదర్శి నాగార్జున, వెంకటయ్యతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి విత్తనంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

పెద్దారవీడు: రైతులు మంచి విత్తనాన్ని ఎన్నుకొని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి ఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్లో చేపట్టాల్సిన వ్యవసాయ పనుల గురించి వివరించారు. ముందుగా వేసవి లోతు దుక్కులు చేసుకోవాలని, భూసార పరీక్ష చేయించుకోవాలని, మంచి విత్తనాలను ఎన్నుకోవాలని, విత్తన మొలక శాతం చూసుకోవాలని, విత్తన శుద్ధి చేసుకొన్న తర్వాతనే విత్తు కోవాలని సూచించారు. పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు రెవెన్యూ అధికారుల ద్వారా కౌలు కార్డులు జారీ చేస్తున్నారని చెప్పారు. అర్హులై ఉండి ప్రస్తుతం అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని వారి కోసం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం సునీల్‌నాయక్, వీఏఏలు ఆదిలక్ష్మి, లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ఎమ్మెల్యే తాటిపర్తి ప్రత్యేక పూజలు



రాజంపల్లిలో తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేసిన అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదం అందుకున్నారు. రథోత్సవంలో పాల్గొని భక్తుల మధ్య స్వామి వారి రథాన్ని కొంత దూరం లాగారు. ఆలయ పరిస్థితులపై ఆరా తీశారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని భక్తులను కోరారు. ఎమ్మెల్యేను అర్చకులు, పార్టీ నాయకులు పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

అశ్వ వాహనంపై తిరుమలనాథస్వామి: బ్రహ్మోత్సవాల సందర్భంగా 8వ రోజు మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ స్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, ప్రసాద వితరణ పూజలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. అశ్వ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ స్వామి కొలువు తీరారు. ఆలయం ప్రాంగణంలో స్వామి వారిని మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



తహసీల్దార్‌ను కలిసిన మండల వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అశోక్‌రెడ్డిని మండల వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, నియోజకవర్గ టీయాసీ అధ్యక్షుడు షెక్షావలి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, నాయకులు యక్కంటి లింగారెడ్డి, మొద్దు తిరుపతిరావులతో పాటు మండలానికి చెందిన పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధునిక పద్ధతుల్లో అధిక దిగుబడులు



బత్తాయి తోటను పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్



ఆరవల్లిపాడులో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు

దొనకొండ: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ అన్నారు. మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహిచంచారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు చీడపీడలు, తెగుళ్ల గురించి అవగాహన కల్పించారు. రైతులంతా విధిగా మట్టి నమూనాలు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులకు సీసీ కార్డుల ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. వ్యవసాయ సహాయకులు ధనరాజ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులంతా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దవరం, దేకనకొండ గ్రామాల్లో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. బత్తాయి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం రైతులకు భూసారపరీక్షల పత్రాలను అందజేశారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరు(కురిచేడు): రైతులు ఈ నెల 20వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఏ తిరుమలరావు కోరారు. మండలంలోని పెద్ద ఉల్లగల్లు, పులిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహిచంచారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు చేశారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించుకోవాలని కోరారు. మత్స్య శాఖ సహాయకురాలు తేజస్వి, గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతిరత్నం, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



కురిచేడు: రైతులకు సూచనలు, సలహాలుఇస్తున్న ఏఓ తిరుమలరావు



రైతులకు భూసార పరీక్షల పత్రాలను అందజేస్తున్న ఏఓ

క్షతగాత్రులకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలైన క్షతగాత్రులను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. ఈ నెల 15న స్థానిక అనకుంట వద్ద బొప్పాయి కోతలకు కూలీలతో వెళ్తున్న వాహనాన్ని మామిడి కాయల లోడుతో వస్తున్న మరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో 28 మందికి గాయాలైన సంఘటన విదితమే. ఈ మేరకు స్థానిక ఒక ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఒంగోలు సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, రోషిరెడ్డి ఉన్నారు.

కారును ఢీకొన్న మోటారు సైకిల్

● ముగ్గురు గిరిజన యువకులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన భూమని శాంసన్

పెద్దదోర్నాల: ముందుగా వెళ్తున్న కారును వెనుకగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న భూమని శాంసన్, కుడుముల వెంకటేశ్వర్లు, కుడుముల బయ్యన్నలకు గాయాలయ్యాయి. ప్రమాద సంఘటనపై స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ఓ ఆటోలో పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. బాధితుల కథనం మేరకు మండల పరిధిలోని చిన్నారుట్లకు చెందిన ముగ్గురు గిరిజన యువకులు మోటారు సైకిల్‌పై యర్రగొండపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని గుంటూరు రోడ్డులో ఉన్న ఓ హోటల్ వద్ద ముందుగా వెళ్తున్న కారును వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో భూమని శాంసన్ కాలికి తీవ్ర గాయం కావటంతో మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు రెఫర్ చేశారు.

వేతన పెంపుపై కాంట్రాక్టు కార్మికుల వినతి

మార్కాపురం టౌన్: మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచాలని, లేని పక్షంలో సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. మంగళవారం కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంచాలని కోరుతూ మున్సిపల్ కమిషనరు నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు జీవోఎంఎస్ నం.36 ప్రకారం రూ.21 వేలు మాత్రమే ఇస్తున్నారని, రూ.24,500కు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు పీఆర్‌సీ, కరువు భత్యం, ఐఆర్, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, చనిపోయిన, అనారోగ్యంపాలైన ఉద్యోగుల స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20వ తేదీ తర్వాత రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని, ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారాయుడు, హరి, నాయకులు సలాంఖాన్, రమణ, శేషిరెడ్డి, అల్లూరయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తా



డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న రామకృష్ణ, ఇతర నేతలు

ముండ్లమూరు(కురిచేడు): తనపై నమ్మకంతో ముండ్లమూరు మండల యూత్ అధ్యక్షునిగా నియమించినందుకు బాధ్యతగా పనిచేస్తానని దుగ్గినేని రామకృష్ణ పేర్కొన్నారు. తనకు పదవి ఇచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం చీమకుర్తిలోని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. .

ఎగ్జిబిషన్‌లో ఘర్షణ

కంభం: ఎగ్జిబిషన్ లో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి చేతికి గాయమైంది. వివరాల్లోకి వెళితే స్థానిక వైజంక్షన్ సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ లో పనిచేస్తున్న ఇరువురి మధ్య మంగళవారం జరిగిన ఘర్షణలో తనను అల్లబకాష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేయడంతో గాయమైందని క్షతగాత్రుడు అబ్దుల్ రఫి తెలిపాడు. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.